క్లుప్తంగా

హెల్మెట్ వాడకం తప్పనిసరి

మోటారు వాహన ఇన్‌స్పెక్టర్ తోట రాఘవరావు



తెనాలిరూరల్: ద్విచక్రవాహనదారులు హెల్మెట్‌ను తప్పనిసరిగా వాడాలని తెనాలి మోటా రు వాహన ఇన్‌స్పెక్టర్ తోట రాఘవరావు సూచించారు. రహదారి భద్రతా మాసోత్స వాల్లో భాగంగా ద్విచక్రవాహనదారులకు శనివారం స్థానిక మార్కెట్ యార్డులో హెల్మెట్ వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. రాఘవరావు మాట్లాడుతూ హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనం నడిపే వారికి రూ. వెయ్యి జరిమానా విధిస్తామని చెప్పారు. 100 మంది రోడ్డు ప్రమాదాల బారిన పడితే అందులో 30 మంది మరణిస్తున్నరని, వీరిలో 18 మంది హెల్మెట్ లేని కారణంగా మరణిస్తున్నా రని తెలిపారు. ప్రాణ రక్షణకు హెల్మెట్ తప్పనిసరిగా వాడాలన్నారు. ఐఎస్ఐ మార్కు ఉన్న హెల్మెట్‌లనే వినియోగించాలని సూచించారు. ద్విచక్రవాహనదారులు, రవాణా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రజాసహకారం అవసరం



తెనాలిరూరల్: గ్రామాలలో సమస్యల పరిష్కారానికి ప్రజల సహకారం కూడా అవసరమని తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ చెప్పారు. రూరల్ గ్రామం ఖాజీపేటలో శ్మశాన వాటిక సమస్యపై గ్రామస్తుల ఫిర్యాదు మేరకు ఆయన స్పందించారు. గ్రామంలో కొందరు క్రైస్తవ మతాచారాలను ఆచరిస్తూ, స్థానికంగా ఉన్న శ్మశాన వాటికలో మతదేహాన్ని పూడ్చి పెట్ట డాన్ని, అదేవిధంగా శవపేటికను ఊరేగిస్తూ తీసుకువెళ్లడాన్ని కొందరు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై స్థానికుల ఫిర్యాదుతో తహసీల్దార్ స్పందించారు. ఒక వర్గంతో సమావేశమై వారి వారి మతాచారాల ప్రకారం చనిపోయిన వారి అంత్యక్రియలు జరుగుతాయని, దానికి అభ్యంతర పరచడం సరికాదని వారితో చర్చించారు. అయినప్పటికీ వారి నుంచి సహకారం కొరవడంతో సోమవారం రెండో వర్గంతో కూడా సమావేశం నిర్వహించి విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించి తగిన చర్యలు తీసుకుంటామని ఆయన నిశ్చయించారు. అలాగే కొలకలూరు-దుగ్గిరాల రైలు మార్గంలో చెన్నైకి మూడవ లైను ఏర్పాటు కారణంగా దాదాపు 200 పైచిలుకు ఎకరాల రైతులకు దారి సమస్య ఏర్పడటంతో సమీపంలో ఉన్న డొంక మార్గాన్ని వినియోగించుకునే రీతిలో దుగ్గిరాల తహసీల్దార్ సునీతతో కలిసి సర్వే నిర్వహించి, డొంకకు మార్కింగ్ చేసి సమస్యను ఓ కొలిక్కి తెచ్చారు. ఆయన వెంట మండల సర్వేయర్, వీఆర్వోలు, వీఆర్ఎలు ఉన్నారు.

వైకుంఠపురంలో హరినామ సంకీర్తన గానం



తెనాలి: స్థానిక శ్రీలక్ష్మీ పద్మావతీ సమేత శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో శనివారం తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మప్రచార పరిషత్ గుంటూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో హరినామ సంకీర్తన బృందంచే గీతాలాపన చేశారు. గురువు పెరవలి వంశీకృష్ణ శిష్య బృందంచే జరిగిన సంకీర్తన కార్యక్రమంలో 'వేడుకొందామా వేంకటేశ్వరుని', 'మూడు నామాలవాడు ఏడుకొండలవాడు', 'అదిగో అల్లదిగో శ్రీహరి వాసము' అనే సంకీర్తనలను గానం చేసి భక్తులను పరవశులను చేశా రు. ప్రోగ్రాం అసిస్టెంట్ ఈ.అమ్మడు గారి పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సంకీర్తన అనంతరం బృంద గురువు పెరవలి వంశీకృష్ణను దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ వి.అనుపమ ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు ఆలయ మర్యాదలతో శేష వస్త్రాన్ని బహూకరించి సత్కరించారు. టీవీఎస్ శాస్త్రి, లక్ష్మీ నర సింహారావు, రాజు, అందె బాలచంద్రమౌళి, మాదల సాయిహనుమంత రావు, నందికంటి రామాంజనేయులు పాల్గొనగా సంకీర్తన బృందంలో మాదల నాగఅర్చన, అందె రాజేశ్వరి, తూనుగుంట్ల దుర్గామల్లేశ్వరి, కొప్పురవు అనిత మాధవి, దంటు శర్వాణి, నందికంటి జయలక్ష్మి, శ్రీపూజిత, కొత్తమాసు పుష్పలత గానం చేయగా, కీబోర్డు వాయిద్య సహకారం నూతక్కి వెంకటేశ్వరరావు, శ్రీదివ్య అందజేశారు.

మురుగు కాల్వలు ప్రతిరోజు శుభ్రం చేయండి

తెనాలిఅర్బన్: పట్టణంలోని మురుగు కాల్వలను ప్రతిరోజు శుభ్రం చేయాల ని మున్సిపల్ చైర్ పర్సన్ తాడిబోయి న రాధిక పేర్కొన్నారు. 19,20 వార్డులలో శనివారం ఉదయం పర్యటించా రు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. మురుగు కాల్వల్లో పాలిథిన్ కవర్లు, ఇతర వ్యర్థాలు ఉండటాన్ని గమనించిన ఆమె సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యాపారులు, ప్రజలు మురుగు కాల్వల్లో ఎటువంటి వ్యర్థాలను వేయవద్దని సూచించారు. ఇలా వేయ డం వలన మురుగు పారుదలకు అంతరాయం ఏర్పడుతున్నాయని చెప్పా రు. అందరూ సహకరించాలని సూచించారు. వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, అసిస్టెంట్ కమిషనర్ వి.ఎం.లక్ష్మీపతి, ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, ఇన్‌చార్జి ఏఈ కళ్యాణ్, పాల్గొన్నారు.

ఆ 'నడక'కు రజతోత్సవం


- నేడు వాకర్స్ క్లబ్, తెనాలి 25వ వార్షికోత్సవం
- ఉత్తమ వాకర్స్, యోగ సాధకులకు సత్కారం



గతేడాది వార్షికోత్సవంలో ఉత్తమ వాకర్స్‌కు సత్కారం

తెనాలి: పట్టణానికి చెందిన వాకర్స్ క్లబ్, తెనాలి రజతోత్సవ వేడుకలు ఆదివారం తెనాలిలో జరగనున్నాయి. స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే బవన్‌లో ఉదయం 7.30 గంటలకు ఏర్పాటయే సభకు క్లబ్ అధ్యక్షుడు గుత్తా వెంకటరత్నం అధ్యక్షత వహిస్తారు. వాకర్స్ ఇంటర్నేషనల్ 203 డిస్ట్రిక్ట్ గవర్నర్ పెద్ది శివరామ్‌ప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరవుతారు. డిస్ట్రిక్ట్ కోశాధికారి లఘువపు సత్యనారాయణ, వాకర్స్ ఇంటర్నేషనల్ పాస్ట్ ప్రెసిడెంట్ చెలికాని సీతారామయ్య అతిథులు. ఉత్తమ వాకర్ మెడతాటి బాపూజి, మహిళా వాకర్ ఎస్.ధనలక్ష్మి, యోగసాధకులు తుమ్మలపల్లి ఉషారాణి, స్వచ్ఛంద సేవకుడు షేక్ ఇనయతుల్లాను సత్కరిస్తారు.

➡ వేగం పెరిగిన నేటిరోజుల్లో వ్యాయామం ప్రాధాన్యత తెలిసిందే... కనీసం రోజులో నలభై నిముషాలు నడిస్తే ఆరోగ్యంగా ఉండొచ్చని అటు వైద్యులూ చెబుతున్నారు. కరోనా తర్వాత ఆరోగ్య స్పృహ పెరిగింది. వీటన్నిటికీ ముందు... పాతికేళ్ల క్రితమే నిత్యం నడకతో రోజును ఆరంభించే కొందరు వాకర్లు, ఆరోగ్యంపై శ్రద్ధను తోటివారికి కల్పించాలని తలపోశారు. అనుకున్నదే తడవుగా వాకర్స్‌క్లబ్, తెనాలి ఆవిర్భవించింది. పట్టణానికి చెందిన పేదల డాక్టరు పాటిబండ్ల దక్షిణామూర్తి వ్యవస్థాపక అధ్యక్షుడిగా సంకా ఉదయశంకర్ కార్యదర్శిగా 15 మంది సభ్యులతో రిజిస్టరు చేశారు. ఇందుకు ప్రేరణ అప్పటి టెలికం డీఈ పీఎస్ఎన్ మూర్తిగా డాక్టర్ దక్షిణామూర్తి చెప్పారు. వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్-203కు అనుబంధంగా తెనాలి క్లబ్ నడక మొదలెట్టింది.



క్లబ్ వ్యవస్థాపకుడు డాక్టర్ పాటిబండ్ల



గుత్తా వెంకటరత్నం, క్లబ్ అధ్యక్షుడు



కడియాల రవిబాబు, క్లబ్ కార్యదర్శి

➡ ప్రతిరోజూ నడక ఆవశ్యకతను ప్రచారం చేయడం, ప్రతినెలా సమావేశంలో ఒక్కో ఆరోగ్యకర అంశంపై వైద్యప్రముఖులచే ప్రసంగాల ఏర్పాటు, ఏడాదిలో రెండునెలలు ఆధ్యాత్మిక అంశాలపై ఉపన్యాసాలు చెప్పించటం లక్ష్యంగా వాకర్స్‌క్లబ్ కృషి చేస్తోంది. ఆరోగ్య యూనివర్శిటీ వైస్‌ఛాన్సలర్ డాక్టర్ ఐవీ రావ్, గుండెమార్పిడి నిపుణుడు డాక్టర్ గోపాలకృష్ణ గోఖలే, ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ డీఎల్ఎస్ ప్రసాద్, ఎండో క్రైనాలజిస్ట్ ప్రొఫెసర్ సీవీ హరినారాయణ, క్యాన్సర్ నిపుణుడు డాక్టర్ జి.జగదీష్ చంద్రబోస్‌తో సహా డాక్టర్ మురళీ బాబూరావు, డాక్టర్ కారుమూరు శ్రీనివాసరెడ్డి వంటి ప్రముఖులు వివిధ ఆరోగ్య సమస్యలపై వాకర్స్‌కు అవగాహన కల్పించారు.

ఆధ్యాత్మిక అంశాలపై సినీనటుడు రావికొండల రావు, మొదలి నాగభూషణ శర్మ, నోరి నారాయణ మూర్తి, ములుకుట్ల విశ్వనాథ శర్మ, బ్రహ్మానంద శాస్త్రి, పొట్టూరి భాస్కరరావులు ఇక్కడ ప్రసంగించారు.

➡ ప్రతి ఏటా జనవరి నెలలో వాకర్స్ క్లబ్ వార్షికోత్సవం జరుపుతూ వస్తున్నారు. ఆ వేడుకల్లో ఉత్తమ వాకర్, ఉత్తమ మహిళా వాకర్, ఉత్తమ యోగ సాధకుని సత్కరిస్తున్నారు. సత్కారం అందుకున్నవారిలో కొప్పుల సాంబశివ రావు, రావి శిల్ప, సూరపనేని రామ్‌ప్రసాద్, దాసరి వసుమతి, కుర్రా రామయ్య, ఎం.శ్రీవాణి, బొలిశెట్టి శైలజ, కోడూరు మల్లికార్జునరావు, కొత్తమాసు నాగేంద్రరావు, వంకాయల రేవతి, కాకుమాను రామకృష్ణ, రాయపాటి సుబ్బారావు, వంగల జగదీశ్వరి తదితరులున్నారు.

➡ తొలుత 15 మంది సభ్యులతో ఆరంభమైన వాకర్స్ క్లబ్‌లో ప్రస్తుతం 150 మంది శాశ్వత సభ్యులు ఉన్నారు. వీరిలో మహాత్మాగాంధీ ఫెలోషిప్ కలిగిన సభ్యులు (రూ.10 వేల సభ్యత్వం) పదిమంది వరకూ ఉన్నారు. 2000 సంవత్సరంలో ఆరంభమైన క్లబ్‌కు తొలుత సంకా ఉదయ్‌శంకర్ మూడేళ్లు, తర్వాత యోగా చార్య షేక్ మొహిద్దీన్ బాచ్చా పదేళ్లు కార్యదర్శిగా వ్యవహరించారు. 2013 నుండి కడియాల రవిబాబు కార్యదర్శిగా ఉన్నారు. వ్యవస్థాపకులు డాక్టర్ దక్షిణామూర్తి అధ్యక్షుడిగా కొనసాగుతూ వయోభారంతో ఆ పదవి నుండి తప్పుకున్నా, 2022 నుంచి విశ్రాంత ప్రిన్సిపాల్ గుత్తా వెంకటరత్నం అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల పరిధిగా గల వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్-203 పరిధిలో తెనాలి వాకర్స్‌క్లబ్ రెండు పర్యాయాలు ఉత్తమ వాకర్స్ క్లబ్‌గా అవార్డును అందుకోవటం విశేషం!

రేపు తెనాలిలో అగ్నిబాధిత పసుపు రైతుల ధర్నా

తెనాలి: దుగ్గిరాలలోని శుభమ్ మహేశ్వరి కోల్డ్‌స్టోరేజీలో అగ్నిప్రమాదం సంభవించి ఏడాది గడచినా తమ కు న్యాయం జరగనందుకు నిరసనగా 'సాంవత్సరీకం' సందర్భంగా ఈనెల 20న తెనాలి మారీసుపేటలోని న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీ వద్ద బాధిత పసుపు రైతులు ధర్నా చేయనున్నారు. అగ్నిబాధిత పసుపు రైతుల సంఘం నాయకుడు ములకా శివ సాంబిరెడ్డి శనివారం మాగంటి యల్ల మందతో కలిసి విలేకరుల సమావేశంలో వివరాలను తెలియజేశారు. గత సంవత్సరం జనవరి 19న కోల్డ్‌స్టోరేజీలో 400 మంది రైతులకు చెందిన దాదాపు రూ.100 కోట్ల పసుపు దగ్ధమైందని గుర్తుచేశారు. గత జులై 10వ తేదీన రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి క్వింటాలుకు రూ.7,000 చొప్పున పరిహారం ఇప్పిస్తానని హామీనిచ్చినట్టు చెప్పారు. ఇన్సూరెన్స్ అధికారులు క్లెయిములను పరిశీలించి, పరిష్కరించనందుకు, పసుపు రైతులకు న్యాయం జరగనందుకు నిరసనగా ధర్నాకు నిర్ణయించినట్టు తెలిపారు. మారీసుపేటలోని గవిని వెంకటేశ్వరరావు ఆస్పత్రి దగ్గర్లోని న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీ వద్ద ఉదయం 10.30 గంటలకు ధర్నా చేపడతామని వివరించారు. బాధిత పసుపు రైతులందరూ ధర్నాలో పాల్గొనాలని కోరారు.

కేంద్రం చేయూత అభినందనీయం

రేపల్లె రూరల్: నష్టాలలో ఉన్న విశాఖ ఉక్కు పరిశ్రమను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం చేయూత ఇవ్వడం అభినందనీయం అని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. పట్టణంలోని తన క్యాంప్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. అనంతరం పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. సమావేశంలో కృష్ణా పశ్చిమ డెల్టా కమిటీ చైర్మన్ పంతాని మురళీధరరావు, నాయకులు గూడపాటి శ్రీనివాసరావు, దండుప్రోలు పిచ్చియ్య, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉపాధి నిధులతో పశుగ్రాసం సాగు

- శతశాతం సబ్సిడీతో 10 నుంచి 50 సెంట్లలో సాగుకు అవకాశం
- ఎస్సీ, ఎస్టీ , సన్న కారు రైతులు అర్హులు

కొల్లిపర: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు శత శాతం సబ్సిడీతో బహువార్షిక పశుగ్రాసాల సాగుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని కొల్లిపర మండల పశువైద్యాధికారి సాయిసతీష్ రాజు తెలిపారు. ఈ మేరకు రైతులు 10సెంట్లు నుంచి 50సెంట్ల వరకు పశుగ్రాసం సాగుచేసుకోవచ్చని చెప్పారు.ఈ నేపథ్యంలో పశుగ్రాసాల సాగుకు సంబంధించి యంత్రాంగం మార్గదర్శకాలు జారీ చేసినట్లు వివరించారు. ఈ నిబంధనల మేరకు జాబ్ కార్డు ఉండి ఐదెకరాల్లోపు పొలం కలిగిన ఎస్సీ, ఎస్టీ కుటుంబాలతో పాటు సన్న, చిన్న కారు రైతులు బహువార్షిక పశుగ్రాసాల సాగుకు అర్హులుగా గుర్తించటం జరుగుతుందన్నారు. ఈ క్రమంలో జీవాల పశు పోషణ, పాడిరంగం అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని మండలంలో 100 ఎకరాల వరకు పశుగ్రాసం సాగును ప్రోత్సహించేందుంకు అధికారులు నిర్ణయించారు.

శతశాతం రాయితీ ఇలా..

10 సెంట్లలో పశుగ్రాసం సాగు చేసేందుకు మొత్తం ఖర్చు రూ.6.599 అవుతుంది. ఇందులో లేబర్ కాంపొనెంట్ కింద రూ.3వేలు, మెటీరియల్ కాంపొనెంట్ (విత్తనం ధర, ఇతర ఖర్చులు) కింద రూ.3.599 చెల్లిస్తారు. 20సెంట్లలో సాగు చేసుకుంటే లేబర్ ఖర్చు రూ.6 వేలు, మెటీరియల్ ఖర్చు రూ.7.197 (మొత్తంరూ.13.197), 30 సెంట్లలో సాగు చేసుకుంటే లేబర్ ఖర్చు రూ.9వేలు , మెటీరియల్ ఖర్చు రూ.10.795 (మొత్తం రూ.19.795) , 40 సెంట్లలో సాగు చేసుకుంటే లేబర్ ఖర్చు రూ.12 వేలు, మెటీరియల్ ఖర్చు రూ.14.394 (మొత్తం రూ.26.394), 50 సెంట్లలో సాగు చేసుకుంటే లేబర్ ఖర్చు రూ.15 వేలు, మెటీరియల్ ఖర్చు రూ.17.992 (మొత్తం రూ.32.992) ఉపాధి నిధుల నుంచి చెల్లిస్తారని, అర్హత ఉన్నవారు దరఖాస్తు చేసుకుంటే ఎన్‌జీఆర్ఎస్ అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేయటం జరుగుతుందని డాక్టర్ సాయి సతీస్‌రాజు వివరించారు.



కొత్తపాలెంలో 10 సెంట్ల భూమి సాగులో ఉన్న పశుగ్రాసం

ఆసక్తి గల రైతులు సంప్రదించాలి

మండలంలో ఆసక్తిగల రైతులు ముందుగా దగ్గరలో ఉన్న పశువైద్యశాలలో వైద్యులను కలసి వారికి ఎన్ని పశువులు ఉన్నాయి, ఎంత భూమి ఉంది వివరాలు తెలిపి దరఖాస్తు పాతం తీసుకోవాలి. అనంతరం రైతులు తమ దరఖాస్తుతో పాటు ఉపాధి జాబ్‌కార్డు, భూమికి సంబంధించిన 1-బి, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా పాస్ పుస్తకం, రేషన్ కార్డు, తో మూడు సెట్లు తయారు చేసుకుని దగ్గరలో ఉన్న పశు వైద్యాధికారి, మండల పశువైద్యాధికారి, దుగ్గిరాలలో ఉన్న ఏడీఏ అధికారి సంతకాలు తీసుకుని రెండు కాపీల్లో ఒకటి మండల పశు వైద్యాధికారి మరొకటి దుగ్గిరాల ఏడీఏ అధికారి దరఖాస్తు పారం వారి వద్ద ఉంచుకుంటారు. మిగిలి చివరి దరఖాస్తు పారం మండలంలోని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కార్యాలయంలో అందించాలి. తదుపరి విచారణ ఎన్‌జీఆర్ఎస్ కార్యాయలంలోని సిబ్బంది పరిశీలిస్తారు.

సూపర్ నేపియర్ రకం అనుకూలం



బహువార్షిక పశుగ్రాసాల సాగుకు సూపర్ నేపియర్ రకం ఈ ప్రాంత వాతావరణ పరిస్థితులకు అనుకూలం, బహువార్షిక రకాల్లో ఇది ముఖ్యమైనది. పశుగ్రాసం అన్ని రకాల నేలల్లో సాగు చేయవచ్చు. సారవంతమైన నేలల్లో అధిక దిగుబడి వస్తుంది. సూపర్ నేపియర్ రకాన్ని అన్ని కాలాల్లోనూ సాగు చేయవచ్చు. 50సెంట్ల భూమిలో ఏడాదికి 90టన్నుల వరకు పశుగ్రాసం దిగుబడి వస్తుంది. ఈ తరహా పశుగ్రాసాలు ఒక్కసారి సాగుచేసుకుంటే కొన్నేళ్ల పాటుయ దిగుబడి వస్తుంది. రైతులు నీటి సదుపాయం కల్పించాల్సి ఉంటుంది.

– సాయిసతీష్‌రాజు, మండల పశువైద్యాధికారి

గోవా మద్యం ఆరోపణలపై ఆకస్మిక తనిఖీలు

- లారీ స్వాధీనం
- నాలుగు గంటల పాటు ఎక్సైజ్ అధికారుల పరిశీలన
- మద్యం లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్న వైనం



లారీ నుంచి సోడా సీసాలను దించుతున్న సిబ్బంది

తెనాలిరూరల్: ఓ లారీ డ్రైవర్ క్వార్టరు మద్యం తాగడంతో ఎక్సైజ్ అధికారులు పరుగులు పెట్టాల్సి వచ్చింది. నానా హైరానా పడుతూ నాలుగు గంటల పాటు వాహనాన్ని తనిఖీ చేయాల్సి వచ్చింది. గుంటూరు నుండి సైతం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు వచ్చి వాహనాన్ని స్వయంగా తనిఖీ చేశారు. చివరకు ఏ అక్రమం జరగలేదని నిర్ధారించుకుని ఊపిరి పీల్చుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. గోవా నుంచి తెనాలికి వచ్చిన ఓ లారీలో భారీగా మద్యం బాటిళ్లు ఉన్నాయంటూ శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తులు ఎక్సైజ్ అధికారులకు సమాచారం ఇచ్చారు. అప్రమత్తమైన ఎక్సైజ్ అధికారులు ఈ అనుమానాలకు తావిస్తున్నట్లుగానే స్థానిక సుల్తానాబాద్ శివారులో శుక్రవారం ఉదయం నుండి రోడ్డు పక్కన లారీ ఆపి ఉండటాన్ని గుర్తించారు. భారీ లోడ్‌తో ఉన్న లారీ రోడ్డు పక్కన ఎందుకు ఆపి ఉంచారంటూ అనుమానం వచ్చిన అధికారులు తనిఖీలు చేశారు. లారీ పట్టణ గంగానమ్మపేటలోని ఓ కూల్‌డ్రింక్ హోల్‌సేల్ డీలరుకు గోవా నుండి ప్రముఖ కంపెనీ సోడా బాటిళ్ల తీసుకు వచ్చినట్లు డ్రైవర్ చెప్పడంతో అధికారులు లారీని గంగనమ్మపేటలోని డీలర్ గోడౌన్ వద్దకు తీసుకువచ్చారు. గుంటూరు నుంచి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఏఈఎస్ మారయ్యబాబు, తెనాలి ఇన్‌చార్జ్ సీఐ అనూరాధ దేవి, సీఐ నయనతార, తెనాలి ఎక్సైజ్ ఎస్ఐ ఫణికుమార్ లు లారీని క్షుణ్ణంగా తనిఖీ చేసి అందులో ఉన్న లోడ్‌ను దింపించారు. అర్ధరాత్రి వరకు అన్‌లోడ్ ప్రక్రియ కొనసాగగా చివరికి అందులో కేవలం ఓ ఎంఎన్‌సీ కంపెనీకి చెందిన సోడా సీసాలు మాత్రమే ఉండటాన్ని గుర్తించారు. మొత్తం 1200 కేసుల సోడా సీసాలు లారీలో గోవా నుండి తెనాలి వచ్చాయి. చివరికి లారీలో మద్యం సీసాలు లేవని నిర్ధారించారు. దీనిపై ఏఈఎస్ మారయ్యబాబు మాట్లాడుతూ తమకు వచ్చిన ఫిర్యాదు మేరకు లారీని తనిఖీ చేయడం జరిగిందన్నారు. ఉదయం వేళల్లో లారీ పట్టణంలోకి రావడానికి అనుమతి లేకపోవడంతో డ్రైవర్ సుల్తానాబాద్ వద్ద ఆపి ఉంచాడని చెప్పారు. లారీలో బాటిల్స్ మినహా ఎటువంటి మద్యం గుర్తించలేదన్నారు.

కాగా లారీని పట్టణ శివారులో నిలిపి ఉన్న సమయంలో దాని డ్రైవరు సమీపంలోని మద్యం దుకాణానికి వెళ్లి క్వార్టరు మద్యం తీసుకుని తాగి లారీ వద్దకు వెళ్లాడు. అక్కడ ఉన్న ఇతర లారీ డ్రైవర్లు, స్థానికులతో మాటల్లో అతను గోవా నుంచి సరుకు తీసుకుని వచ్చానని చెప్పడంతో అక్రమంగా గోవా మద్యం తీసుకువచ్చాడన్న ప్రచారం జరగడంతో అధికారులు నానా హైరానా పడాల్సి వచ్చింది.

స్వచ్ఛ తెనాలి కల సాకారానికి కృషి



ర్యాలీలో పాల్గొన్న చైర్‌పర్సన్ రాధిక, కమిషనర్ శేషన్న



డిపో ఆవరణను శుభ్రం చేస్తున్న డీఎం రాజశేఖర్

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక

తెనాలిఅర్బన్: స్వచ్ఛ తెనాలి కళను సాకారం చేసేందుకు కృషి చేస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. తెనాలి పురపాలక సంఘం ఆధ్వర్యంలో శనివారం ఉదయం చినరావూరులోని సత్యనారాయణ లేక్ పార్కు వద్ద నిర్వహించిన స్వర్ణాంధ్ర- స్వచ్ఛదివాస్ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ముందుగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం రోడ్లను ఊడ్చి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెనాలి పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు అనేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. దీనిలో భాగంగా చినరావూరు పార్కును మున్సిపల్ నిధులతో అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. అలాగే నూతనంగా మురుగు కాల్వలు, రోడ్లను కూడా నిర్మిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు కూడా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, కమిషనర్ బండి శేషన్నలు మాట్లాడుతూ ప్రతి రోజు పట్టణంలో చెత్తసేకరణ చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో ఎక్కడలేని విధంగా మూడు బుట్టల విధానాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి నెల 3వ శనివారం స్వచ్ఛాతదివాస్‌గా నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. 15వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజలందరూ ఇలాంటి కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరా రు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ వి.ఎం. లక్ష్మీపతి, ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, మున్సిపల్ ఉద్యోగులు, నగరదీపికలు పెద్ద సంఖ్యలోతదితరులు పాల్గొన్నారు.

➡ ఆర్టీసీ డిపో ఆవరణలో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆవరణను ఊడ్చి శుభ్రం చేశారు. డీఎం ఎ.రాజశేఖర్ మాట్లాడుతూ డిపో ఆవర ణలో ప్రతినెలా స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రయాణీకులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ఐజె.ప్రసాద్, హెడ్ కానిస్టేబుల్ ఎస్.శ్రీనివాస్, పాల్గొన్నారు.

ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి



తెనాలిరూరల్: తెనాలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో స్వర్గీయ నందమూరి తారక రామారావు 29వ వర్ధంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. పలుచోట్ల జరిగిన వర్ధంతి కార్యక్రమాల్లో పార్టీ నాయకులతో కలిసి మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు. ముందుగా మున్సిపల్ కూరగాయల మార్కెట్ ఎదుట ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రక్తదానం చేసిన నాయకులు, కార్యకర్తలకు ఆలపాటి రాజేంద్రప్రసాద్ ప్రశంసాపత్రాలు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ నాయకులు పెండేల వెంకట్రావు, తాడిబోయిన హరిప్రసాద్, మహ్మద్ ఖుద్దూస్, నన్నపనేని సుధాకర్, కాకుమాను రాంబాబు, డాక్టర్ వేమూరి శేషగిరిరావు, దేసు యుగంధర్, తాడిబోయిన బ్రహ్మేశ్వరరావు, అన్నం పిన్నారావు, కంచర్ల ఏడుకొండలు పాల్గొన్నారు.

హంస వాహనంపై సాయిబాబా ఊరేగింపు



పురవీధుల్లో ఊరేగింపు

తెనాలి: పట్టణ రామలింగేశ్వరపేటలోని సాయినాథుని సత్సంగ కేంద్రం 33వ వార్షికోత్సవాలు శనివారం వైభవంగా ఆరంభించారు. రెండురోజుల పాటు జరిగే ఈ వేడుకల్లో భాగంగా సాయంత్రం 6.30 గంటలకు సత్సంగ కేంద్రం నుంచి సాయిబాబా, శరత్ బాబూజీ ఉత్సవమూర్తులను విద్యుద్దీపాలతో అలంకరించిన హంస వాహనంపై పట్టణంలో ఊరేగింపు జరిపారు. వివిధ వాయిద్యాలు, గురుదేవుల నామ సంకీర్తనలతో భక్తులు ఉత్సాహంగా ఊరేగింపులో పాల్గొన్నారు. సృజన ఆధ్వర్యంలో శ్రీదుర్గమ్మ తల్లి కోలాట కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పురవీధుల్లో ఊరేగింపుగా రాత్రి 9.30 గంటలకు బుర్రిపాలెంరోడ్డులోని టీజీకే కళ్యాణమండపానికి చేరుకుంది. బాబా గురుదేవులకు అక్కడ ఏర్పాటుచేసిన 'లెండివనము'లో నివేదన, హారతి సమర్పించాక, ప్రసాద వినియోగం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. 1992లో స్థాపించిన సాయినాథుని సత్సంగ కేంద్రానికి సాయినాథుని శరత్‌బాబూజీ స్వయంగా సాయిబాబా ఫొటోను స్వహస్తాలతో అందించినట్టు కన్వీనర్ వీజే నాగభూషణరెడ్డి తెలిపారు. వ్యవస్థాపకుడు జి.సాయివరప్రసాద్, ఎం.నరసింహారావు సత్సంగ కేంద్రానికి విలువైన సేవలు చేసినట్టు చెప్పారు. 19వ తేదీ ఉత్సవ కార్యక్రమాలు ఉదయం ఏడు గంటలంచి సాయంత్రం అయిదు గంటల వరకు జరుగుతాయని వివరించారు. కార్యక్రమంలో వీజే నాగభూషణరెడ్డి, కొల్లిపర దత్తు, సాయి, ఫణి, శ్రీనివాసు, వెంకటేశ్వరరావు, రామలింగేశ్వరరావు, టీజీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల సహకారం



వితరణ అందజేస్తున్న పూర్వవిద్యార్థులు

కొలకలూరు(తెనాలి): పాఠశాల అభివృద్ధిలో పూర్వవిద్యార్థుల సహకారం మరువలేనిదని కొలకలూరులోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాచర్ల నాగేశ్వరరావు అన్నారు. పాఠశాలలో 2005-06 విద్యాసంవత్సరం పదోతరగతి చదివిన నాటి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమకు విద్యాబోధన చేసిన గురువులను సత్కరించారు. అంతేకాకుండా పాఠశాలకు అవసరమైన ఇన్వర్టర్, కుర్చీలను శనివారం ప్రధానోపాధ్యాయుడు మాచర్ల నాగేశ్వరరావుకు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటి చైర్మన్ షేక్ జిలాని, ఉపాధ్యాయుడు మత్తె అన్నారావు, మాలావత్ బాల నాగయ్యానాయక్, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

● ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

అమర్తలూరు(వేమూరు): నవోదయ ఎంట్రన్స్ పరీక్ష జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో శనివారం ప్రశాంతంగా జరిగింది. ప్రధానోపాధ్యాయుడు కనపర్తి నిరీక్షణరావు మాట్లాడుతూ.. 37 మంది కిగాను 32 మంది రాశారన్నారు. పరీక్ష కేంద్రాన్ని ద్వామా పి.డి. విజయలక్ష్మి పరిశీలించారు.

అండర్-17 హ్యాండ్‌బాల్ పోటీల్లో ఏపీకి రజతం



రన్నర్స్‌గా నిలిచిన ఏపీ జట్టు

తెనాలి: తెనాలి డబుల్ హార్స్ ఫౌండేషన్ హ్యాండ్ బాల్ క్రీడాకారులు జాతీయస్థాయిలో సత్తా చాటారు. తెలంగాణ రాష్ట్రంలోని మహబూబ్‌నగర్‌లో ఈనెల 11-17తేదీల్లో జరిగిన 68వ జాతీయ స్థాయి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ (అండర్-17) బాల బాలికల హ్యాండ్‌బాల్ పోటీల్లో తెనాలి డబుల్ హార్స్ ఫౌండేషన్ క్రీడాకారులు ఆడిన ఆంధ్రప్రదేశ్ జట్టు ద్వితీయస్థానంలో నిలిచి రజత పతకం కైవసం చేసుకుంది. ఈ పోటీల్లో దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన 30 జట్లు పాల్గొన్నాయి. బాలుర విభాగంలో విన్నర్స్‌గా తెలంగాణ విజయం సాధించగా, రన్నర్స్‌ను ఆంధ్రప్రదేశ్ జట్టు కైవసం చేసుకుంది. జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన కెప్టెన్ తేజసాయి రెడ్డి, గౌరీ శంకర్, రాజుపాల్ వెంకటేష్, విజయ్ , రాజు, విజిష్ తదితరులు తెనాలి ఫౌండేషన్ ద్వారా స్పాన్సర్ తీసుకుంటూ కోచ్ నాగరాజు ఆధ్వర్యంలో శిక్షణ తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా క్రీడాకారుల్ని తెనాలి డబుల్ హార్స్ ఫౌండేషన్, కోచ్ నాగరాజు, జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి వెంకటేశ్వర రావు తదితరులు అభినందించారు.